దైవ చింతనతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే వీరేశం

పామనుగుండ్లలో రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, ఏప్రిల్ 26 : దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని భాస్కర్లబాయి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, పామనుగుండ్ల గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించడం మన తెలంగాణ ప్రాంత సంప్రదాయమన్నారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మాదయాదగిరి, సుంకరబోయిన నర్సింహ, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, నాయకులు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, మాద లింగస్వామి, బండారు కృష్ణయ్య, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 26 : వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పుత్రి ఫిజిషియన్ డాక్టర్ జి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ ఎస్వీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం న్యూమోనియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం బ్రోకో న్యూమోనియా వ్యాధి ప్రబలుతుందని తెలిపారు. ఈ వ్యాధి ధూమపానం, చల్లని పదార్థాలు తీసుకోవడం, కాలుష్యం వల్ల సోకుతుందన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి సరైనా చికిత్స అందిస్తే తక్కువ ఖర్చులతోనే వ్యాధి తగ్గుతుందని తెలిపారు. శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుందని దీనిని అధిగమించేందుకు ఏడాదికోకసారి ఇన్ఫ్లూయాంజా వ్యాక్సిన్‌ను తీసుకోవాలని సూచించారు. వరుసగా రెండేండ్లు ఈ వ్యాక్సిన్‌ను తీసుకుంటే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గిరిప్రసాద్, బాలాజీనాయక్, ఆస్పత్రి డైరెక్టర్ గోరుకుంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి అధికారి శ్రీనివాస్, వాసు, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నారమ్మ గూడెం విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంకు

పాకాల చందుశ్రీ

నిడమనూరు, ఏప్రిల్ 26 : మండలంలోని నారమ్మ గూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకును సాధించింది. గ్రామానికి చెందిన రైతు పాకాల సైదులు, అన్నపూర్ణ దంపతుల కుమార్తె చందు హైదరాబాద్ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ విభాగం) చదువుతున్నది. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 470 మార్కులకు 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకును కైవసం చేసుకున్నది. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొండమల్లేపల్లి : లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న తానీల్దార్ అనురాధ

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని 22 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తానీల్దార్ అనూరాధ శుక్రవారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ కవిత, నరేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆకాంక్ష హైస్కూల్ విద్యార్థి

విద్యార్థి అఖిల్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

హాలియా,ఏప్రిల్ 26 : హాలియాలోని ఆకాంక్ష పాఠశాల హైస్కూల్ విద్యార్థి అఖిల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27,28 తేదీల్లో సూర్యాపేట జిల్లాలోని డిగ్రీ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రావు, హెచ్ఎం మోదాల రవీందర్,పాఠశాల పీఈటీ చంద్రశేఖర్ అఖిల్‌ను అభినందించారు.

బత్తాయి తోట దగ్ధం

కాలిన బత్తాయి చెట్లు, డ్రిప్ పైపులు

త్రిపురారం, ఏప్రిల్ 26: మండలంలోని జి.అన్నారం పరిధిలో శుక్రవారం చిలుక వేణుగోపాల్‌రెడ్డికి చెందిన బత్తాయి తోటకు నిప్పు అంటుకోవడంతో 30 బత్తాయి చెట్లు, డ్రిప్ పైపులు, వాటర్ పైపులు కాలిపోయాయి. ఉపాధి హామీ కూలీలు తోట పక్కన ఉన్న చెత్తకు నిప్పుపెట్టడంతో అది వ్యాపించి పక్కకు అంటుకున్నాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం జరిగిందని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల, ఏప్రిల్ 26 : అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ డీ.సైదాబాబు తెలిపారు. బీబీనగర్ మండలంలోని జూంపల్లి గ్రామానికి చెందిన గనావత్ దిలీప్ సూర్యాపేట నుంచి బీబీనగర్‌కు ఆటోలో బియ్యం తరలిస్తుండగా శుక్రవారం భువనగిరి క్రాస్ రోడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ఆటో డ్రైవర్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. దాంతో వారు అతడిని పట్టుకొని విచారించగా సూర్యాపేట చుట్టు పక్కల గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి బీబీనగర్ ప్రాంతంలోని పౌల్ట్రీ ఫారాల యజమానులకు ఎక్కువ ధరకు విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రూ.36వేల విలువ చేసే 20 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

- అధికార పార్టీ, బడా ప్రజాప్రతినిధి అండదండలతో వ్యాపారం
- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

వేములపల్లి చెరువులో మట్టిని తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఈ సాయిరెడ్డి (ఫైల్)

వేములపల్లి, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో చెరువు మట్టిని అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. రైతుల పేరు చెప్పి ఇటుక బట్టీల కోసం నల్లరేగడి మట్టిని అర్ధరాత్రి తరలిస్తున్నారు. వాస్తవానికి జేసీబీతో చెరువులో మట్టిని తవ్వడం నిషేధం. ఒకవేళ ప్రభుత్వం పూడిక మట్టి తొలగింపునకు అనుమతులు ఇచ్చినా కేవలం రైతులు మట్టిని గడ్డ పారతో తవ్వి ఎడ్లబండ్లతో తరలించుకోవాలి. కానీ వేములపల్లికి చెందిన చెరువులో అధికార పార్టీ నాయకులు జేసీబీ పెట్టి భారీగా నల్ల మట్టిని తరలిస్తున్నారు. కొందరు దళారులు రైతుల పేర్లు చెప్పి జేసీబీ, ట్రాక్టర్లు భారీ సంఖ్యలో మోహరించి మట్టిని యథేచ్ఛగా తవ్వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ మట్టికి రూ.1000 నుంచి రూ.1500కు అమ్ముకుంటున్నారు. ఈ తతంగమంతా భీమారం, సూర్యాపేట రహదారిపై జరుగుతున్నా ఇటు అధికారులు, అటు పోలీసులు పట్టించుకోక పోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అర్ధరాత్రి మట్టి తరలింపు..

చెరువులో నల్లరేగడి తరలింపునకు వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. అర్ధరాత్రి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో చెరువుల్లో తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రంతా చెరువుల నుంచి మట్టిని తరలించి తమకు అనుకూలంగా ఉన్న చోట డంప్ చేస్తున్నారు. ఈ తంతు స్థానికంగా ఉన్న కొందరు అధికార పార్టీ నాయకులు కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి తోలుకోవడానికి ప్రభుత్వ, గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉండగా అనుమతులు తీసుకోకుండానే తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంతలా మట్టి క్రమ రవాణా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు కన్నెత్తి కూడా చూడకుండా వ్యాపారులకు వత్తాసు పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మట్టి తరలిస్తే చర్యలు తీసుకొంటాం

చెరువులో మట్టి తరలింపునకు అనుమతులు లేదు. మట్టిని తరలిస్తున్న జేసీబీ సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేశాం. మట్టిని తవ్వేందుకు అక్రమార్కులు ఎప్పుడైనా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–సాయిరెడ్డి (ఏఈ)

చెరువు మట్టి తరలింపులో తలెత్తుతున్న వివాదాలు

- అనుమతులు రద్దు చేసినా ఆగని తరలింపు..
- పట్టించుకోని అధికారులు

దిలావర్‌పూర్ చెరువు నుంచి తరలిస్తున్న మట్టి (ఫైల్)

దామరచర్ల : మండలంలోని పలు చెరువుల్లో అక్రమంగా తరలిస్తున్న మట్టిపై వివాదాలు ముదురుతున్నాయి. మండలంలోని వాచ్యాతండా, దిలావర్‌పూర్ గ్రామాల్లోని వాచ్యాతండా, దిలావర్‌పూర్ గ్రామ చెరువుల నుంచి రాత్రి వేళల్లో మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లుగా గ్రామస్తులు, రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దిలావర్‌పూర్ చెరువులో కొందరికి మట్టి తవ్వుకోవడానికి అధికారులు అనుమతులు ఇచ్చారు. దాంతో పాటుగా మరికొంత మంది రైతులు కూడా తమకు కూడా మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వాలని కోరినా పట్టించుకోక పోవడంతో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట దిలావర్‌పూర్ రైతులు ధర్నా నిర్వహించారు. దాంతో తొలుత ఇచ్చిన అనుమతులను అధికార్లు రద్దు చేశారు. అయినా మట్టి అక్రమ రవాణ ఆగలేదని గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా మట్టి అక్రమ తరలింపుపై పలుమార్లు కేసులు నమోదు చేసినా రెవెన్యూ, పోలీసు అధికార్లు పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూసి మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోక పోతే వివాదాలు ముదిరే అవకాశం ఉంది.

అధ్వానంగా లింకు రోడ్లు

- అవస్థలు పడుతున్న గ్రామీణ ప్రజలు

కంకర తేలిన కల్మెర– సత్యనారాయణపురం లింకు రోడ్డు

కట్టంగూర్, ఏప్రిల్ 25 : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే లింకు రోడ్డు అధ్వానంగా మారాయి. దాంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునుకుంట్ల– కురుమర్తి, ఈదులూరు– ఆకారం, కల్మెర– సత్యనారాయణపురం, ఈదులూరు– మసిబాయిగూడెం, కట్టంగూర్ –బిల్లంకానిగూడెం, దుగినవెల్లి– తూర్పాయిగూడెం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆయా రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు అల్లుకుపోయి, కంకరతేలడంతో రైతులు. వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న ఫలితం లేదని ఆయా గ్రామా ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 26: మిర్యాలగూడ ఆర్టీసీ పరిధిలో వినియోగదారుల కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం పాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 11 నుంచి 12గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు 9959226 308 నంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు,సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కోరారు.

మేడేను జయప్రదం చేయాలి

నిడమనూరు, ఏప్రిల్ 26 : మేడే ఉత్సవాలను జయప్రదం చేసేందుకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, సీఐటీయూ మండల కన్వీనర్ కొమాండ్ల గుర్వయ్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన మే డే సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కర్షక, కార్మిక, పేద వర్గాలకు అండగా నిలిచేది ఎర్ర జెండానేనన్నారు. మే డే ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బొడ్డు లింగయ్య, గుత్తా శ్రీనివాస్ రెడ్డి, కోదండ చరణ్‌రాజ్, తోటపల్లి బాలనారాయణ, లక్ష్మయ్య, శ్రీను, సైదులు, వేణు శంకరయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే సామేల్ పరామర్శ

శాలిగౌరారం, ఏప్రిల్ 26 : మండలంలోని అడ్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోడ అశ్విన్ భార్య గురువారం మృతి చెందింది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. భూపతి అంజయ్యగౌడ్, చిత్తలూరి వెంకన్న, నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నల్లమోతు సిద్ధార్థ పరామర్శ

వేములపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని శెట్టిపాలెం గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మజ్జిగపు సుధాకర్‌రెడ్డి తండ్రి పెద్ద లింగారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ లింగారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్టా మల్లేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాబుసాయిపేటలో గంగాభవాని విగ్రహ ప్రతిష్ఠ

అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురారం, ఏప్రిల్ 26: మండలంలోని బాబుసాయిపేటలో గంగాభవాని ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విచ్చేసిన సుమారు 2వేల మంది భక్తులకు శుక్రవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నదానం చేశారు. అమ్మవారి ప్రతిష్ఠ కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీ పీ బుర్రి రాంరెడ్డి, మాజీ సర్పంచులు శాగం శ్రవణ్ కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కలగాని శ్రవణ్ కుమార్, నాయకులు బచ్చు సాంబయ్య, చెదుర్లపల్లి నాగరాజు, గోపగాని నర్సయ్య, ఎల్లయ్య, గంగుల శ్రీను, మాతయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తీరుపై నిరసన

కండ్లకు గంతలు కట్టుకొని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సమాచార హక్కు సమితి కార్యకర్తలు

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 26 : మున్సిపల్ కార్యాలయంలో ఆర్టీఐ దరఖాస్తుదారుల పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సమాచార హక్కు సలహా సహాయ రక్షణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుటు కండ్లకు గతలు కట్టుకొని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సరికొండ రుషికేశ్వర్‌రాజు మాట్లాడుతూ పట్టణంలోని న్యూ ఎన్టీఆర్ మున్సిపల్‌కాంప్లెక్స్‌లో దుకాణాల వేలానికి సంబంధించి 02/06/2018లో లేఖ నంబర్ G/180/MM/1/17-18 ద్వారా మున్సిపల్ అధికారులు కాంప్లెక్స్‌లో నిర్వహించిన వేలంలో పాల్గొన్న ఒక్కొక్కరూ రూ. 25 వేలు డీడీలు చెల్లించారు. దుకాణం దక్కించు కున్నవారు మిగిలిన డబ్బులు సుమారుగా కోటిన్నర రూపాయలు కట్టడానికి ఆరేండ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్టీఐ దరఖాస్తు చేశామని, 30 రోజులు గడిచినా సమాచారం ఇవ్వకూడదని పీఐఓ, కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. 100 ఆర్టీఐ దరఖాస్తుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు 42 దరఖాస్తులు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పందిరి అజయ్, అంబటి వీర హనుమాన్, శేఖర్, నారాయణస్వామి, వెంకట్‌రెడ్డి, మహేశ్, వెంకటేశ్, శశి,ప్రీతం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బండపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

కేతేపల్లి, ఏప్రిల్ 26 : మండలలోని ఉప్పలపహాడ్, కొప్పోలు, తుంగతుర్తి, చెర్కుపల్లి, తదితర గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్రాల్లో అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. నిర్ణీత తేదీల లోపు ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందజేయాలన్నారు. ఆయన వెంట ఏఈ మౌనిక, అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

గుండ్రాంపల్లిలో వేసవి శిబిరం ప్రారంభం

చిట్యాల, ఏప్రిల్ 26 : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ గ్రంథాలయం, సమాచార కేంద్రంలో బాలబాలికల కోసం శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులకు చదివే అలవాటును ప్రోత్సహించడంతోపాటు కథలు చెప్పడం, డ్రాయింగ్‌లో శిక్షణ, తెలుగు, ఇంగ్లిష్, గణితంలో బేసిక్స్ నేర్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రతి రోజు 2 గంటల పాటు మే 10 వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇవ్వనున్నట్లు గుండ్రాంపల్లితోపాటు పరిసర గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌టీసీ అధికారులు

ఆర్‌టీసీ కార్గో ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

చిట్యాల, ఏప్రిల్ 26: చిట్యాల బస్టాండ్ లోని ఆర్‌టీసీ కార్గో ఆధ్వర్యం లో సాయి నాథ్ మొబైల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్‌టీసీ ఎస్ఎం ఎంవీ చారి, మొబైల్ షాపు యజమాని ఉదయ్ శుక్రవారం ప్రార ంభించారు. కార్యక్రమంలో కంట్రోలర్లు శ్రీనివాసు, లింగయ్య, కార్గో నిర్వాహకుడు పొలిమేర దశరథ, కన్నెబోయిన మహలింగం, గుండాల నరేశ్, కురుపటి రాజయ్య పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాలలో ఓటరు చైతన్యంపై ఫొటో ప్రదర్శన

రామగిరి, ఏప్రిల్ 26: నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో ఓటరు చైతన్యంపై ఫొటో చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఈనెల 27వరకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న దాతలు

పార్వతీ రామలింగేశ్వరస్వామి ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

వేములపల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని ఆమనగల్లు గ్రామంలో కొలువై ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో దాతలు ఫంక్షన్‌హాల్‌కు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన పైడిమర్రి కేశవులు, మిర్యాల రామ్మూర్తి బ్రదర్స్, గడ్డం విష్ణుస్వరూప్‌రెడ్డి, దాస్యం సురేందర్, మిర్యాల వెంకటేశ్వర్లు గ్రామాభివృద్ధి కోసం 1.10ఎకరం భూమిని కొనుగోలు చేసి రూ.50లక్షలతో ఆలయ సమీపంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి ఫంక్షన్‌హాల్‌కు నిర్మాణానికి వేద పండితులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దాతలు ఆలయ సమీపంలోనే ఫంక్షన్‌హాల్‌ను నిర్మించడం గొప్ప విషయం న్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లంపట్ల అబ్రహం, మిర్యాల భిక్షమయ్య, కర్పూరం లక్ష్మీనరసింహ, వల్లంపట్ల కోటయ్య, పిల్లల కృష్ణయ్య, మాజీ సర్పంచ్ వల్లంపట్ల ప్రవీణ్, నాయకులు మెరుగు జాని, పెరుమాళ్ల నగేశ్, పిల్లల సందీప్, పత్తిపాటి వినయ్, గంట కృష్ణయ్య, అవిరెండ్ల సతీశ్, కొండ వెంకన్న, జోజి, వాకిటి భిక్షం, ముత్యాల యుగేంధర్, వెంకన్న, కోల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ప్రైవేట్ ఉపాధ్యాయురాలు మృతి

ఆశ్రిత (ఫైల్)

నకిరేకల్, ఏప్రిల్ 26 : వడదెబ్బతో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త బోడ అశ్విన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన బోడ ఆశ్రిత(35) నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం టెక్నో పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. ఈ నెల 24న నల్లగొండలోని బంధువుల వివాహానికి వెళ్లింది. ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురైంది. ఆపై ఇంట్లో ఫ్రిడ్జ్‌లోని చల్లని నీరు తాగింది. గతంలోనే టాన్సిల్స్ ఇబ్బందులు ఉం డేది. ఆపై చల్లని నీరు తాగడంతో గొంతు వాపు వచ్చి తీవ్ర జ్వరానికి రావడంతో ప్రైవేటు ఆస్పుత్రికి తీసుకెళ్లాం. చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. వడదెబ్బతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గుమ్మడవెల్లి మాజీ ఉపసర్పంచ్ మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని గుమ్మడవెల్లి మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీర్ శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆల్లంపల్లి నర్సింహ, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఉట్కూరి వేమన్‌రెడ్డి ఉన్నారు.